క్లుప్తంగా

ఆటోస్టాండ్‌కు బెంచీల వితరణ



ఆటోస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన బెంచీలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని యాతపాలేనికి చెందిన పితాని చింతాలు జ్ఞాపకార్థం అతని కుమారులు ఆటోస్టాండ్‌కు బెంచీలను ఆదివారం అందజేశారు. యాతపాలెం జంక్షన్‌లో నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, అయితే వారు కూర్చోవడానికి ఎటువంటి వసతి సదుపాయం లేకపోవడంతో వీటిని ఏర్పాటు చేశామని పితాని అప్పారావు తెలిపారు. ప్రయాణికులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

కంచరపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్–2 డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ, సంస్థ జోన్–2 ఈఈ బి.కోటేశ్వరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట జోన్–2 ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చు తగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సరీస్ల జారీలో జాప్యం, బిల్లుల్లో పేరు మార్పు, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు తదితర సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు నగదు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం ఆదివారం నగరంలోని పిఠాపురం కాలనీకి చెందిన ఇమంది లక్ష్మీప్రసాద్ రూ. లక్ష విరాళం ఇచ్చారు. సంబంధిత విరాళాన్ని ఆలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు నగదురూపంలో అందజేశారు. దాతకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

భారతీయ ప్రాచీన వేదాల విజ్ఞానం ఆచరణాత్మకం

ఎంవీపీకాలనీ: భారతీయ ప్రాచీన వేదాలు అత్యంత సుస్థిర, ఆచరణాత్మకమైనవని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ప్రాచీన వేదాల్లో సుస్థిరమైన విజ్ఞానం దాగి ఉందన్నారు. నేటి ఆధునిక యుగంలోని శాస్త్రవేత్తలు సైతం దీన్ని ధ్రువీకరించడం అభినందనీయమన్నారు. దాన్ని వెలికి తీసి పాటించడం ద్వారా ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. వేదాల విజ్ఞానం ఆధునిక సమాజానికి సైతం మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి దంపతుల నేతృత్వంలో నిర్వాకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్‌లు యాగాది క్రతువులు, ప్రత్యేక విశేష పూజలు నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ వరకు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ ప్రవచనాలతో పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను జరుగుతాయని శ్రీమాత భక్త బృందం సభ్యులు తెలిపారు. ఈ ప్రవచనాల కార్యక్రమంలో 1000 మందికి పైగా నగర భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికీ ప్రచారం చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల సచివాలయాల కన్వీనర్ హర్షవర్ధన్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నువ్వే మా జగనన్న అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 75, 76, 67, 68వ వార్డులకు చెందిన వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లలో గాజువాక ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రతిపక్షాల నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని మండల కన్వీనర్లు, గృహ సారథులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక నాయకులతో కలసి, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమర్థవంతంగా పని చేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తిరుగులేని విజయం అందించాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా చినతల్లి, మండల క్లస్టర్ కన్వీనర్లు కులుకూరి మంగరాజు, ఎండీ గౌస్, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, గుడివాడ లతీష్, మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి, వెంపాడ అప్పారావు, మహేశ్వరరెడ్డి, మంత్రి శంకరనారాయణ, గొందేశి సత్యారావు, జగదీష్, కొయ్య భారతి, వెంకటేష్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా..

కూర్మన్నపాలెం: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించే ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మండల కన్వీనర్లపై ఉందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలోని శ్రీ వాసవి గుండా అనంత లక్ష్మి ధ్యానమందిరంలో 86,87,88 వార్డులకు చెందిన వార్డుల గృహసారథుల, కన్వీనర్లు, వలంటీర్లు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక ఎన్నికల పరిశీలకుడు, బీసీ కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, ఉత్తరాంధ్ర జిల్లాల సచివాలయాల కన్వీనర్ హర్షవర్ధన్, గాజువాక వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, సచివాయల పరిధిలో 50 ఇళ్లు ఉన్న ప్రతి క్లస్టర్‌కు ఇద్దరు గృహ సారథులను నియమించారన్నారు. ప్రతిపక్షాలు సృష్టించే అపోహలను మండల కన్వీనర్లు, గృహసారథులు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి, 86వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ దామా సుబ్బారావు, 87వ వార్డు ఇంచార్జ్ కోమటి శ్రీనివాసరావు, 88వ వార్డు ఇంచార్జ్ మహాలక్ష్మినాయుడు, గాజువాక క్లస్టర్ ఇంచార్జ్ వాడపల్లి రామచంద్రరాజులు, ప్రగడ వేణుబాబు, ఎన్నేటి రమణ, బొడ్డ గోవింద్, కోమటి రమాదేవి, నమ్మి ప్రసాద్, ప్రగడ గోవిందరాజు, చిత్రాడ రమణ, జెర్రిపోతుల ఈశ్వరరావు, దుగ్గపు దానప్పలు, చిత్రాడ కనకసూర్యపద్మావతి, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ ముద్రించిన స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న హర్షవర్ధన్, నాగిరెడ్డి తదితరులు



సమావేశానికి హాజరైన కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు

దేవతారాధనతోనే గ్రామాలు సుభిక్షం



భూమిపూజ చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తదితరులు

పెదగంట్యాడ: గ్రామాలను కాపాడే గ్రామదేవతలను ఆరాధించడం ద్వారా ఆయా గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దల్లివానిపాలెం ఆర్.హెచ్.కాలనీలో సచివాలయం పక్కన నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలసి ఆదివారం భూమిపూజ చేశారు. దల్లివానిపాలెం గ్రామ పెద్ద గొందేశి సత్యారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ ఆలయానికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ 45 ఏళ్ల క్రితం నాటి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడం మళ్లీ కొత్తగా నిర్మించేందుకు ఆలయ కమిటీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆలయ కమిటీ సభ్యులకు అందుబాటులో ఉంటానని, వారికి అవసరమైన సహకారాన్ని అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్‌రాజు, మంత్రి రాజశేఖర్, గొందేశి వెంకటరమణారెడ్డి, ఎస్.రామారావు, తిప్పల నితీష్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, అప్పలరెడ్డి, మంత్రి శంకరనారాయణ, నక్క రమణ, పూతి తాతారావు, గొందేశి రాము, దల్లి పైడికొండ, పిట్టా రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం



అలంకరణలో పైడమాంబ అమ్మవారు



చతకపట్టు ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడక కలోని పైడిమాంబ అమ్మవారి ఆలయానికి చెందిన ఘటాలకు చతకపట్టు ఆలయ నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పైడిమాంబ ఘటాల ఆలయ కమిటీ సారధ్యంలో చేపట్టిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. తరువాత అతిథులు మాట్లాడుతూ నిర్వాసితులను అమ్మవారు చల్లగా చూడాలని, ఆమె ఆశీస్సులు నిర్వాసితులకు, అగనంపూడి పరిసర ప్రాంతీయులకు అందివ్వాలని వారు అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఘటాల ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు నెల్లి శ్రీను, గెద్దాడ సత్యవతి, ఎం.శ్రీను, యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి, అప్పారావు, జనసేన వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్, పైడిమాంబ ఆలయ కమిటీ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉక్కు పోరు ఆపేదే లేదు



724వ రోజు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మికుల ఉద్యమానికి విలువనిచ్చి ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉక్కు పోరాటాన్ని విరమించేదిలేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. 724వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో కాంట్రాక్ట్ కార్మికులు, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్షలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రంలో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణలో భాగంగా కేంద్రానికి సహకరిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని రాష్ట్ర ప్రజలు మరియు సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు కోరుతున్నారని, ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి ఈ ప్రాంత ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సేవ్ పబ్లిక్ సెక్టార్– సేవ్ ఇండియా పేరుతో అన్ని పరిశ్రమల కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఉక్కు ఉద్యమానికి 700 రోజులు గడిచినా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదని, కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఎందుకు ఇంత చిన్న చూపు చూస్తోందో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ నర్సింహ పాత్రుడికి ఆత్మీయ సత్కారం



కార్పొరేటర్ నర్సింహ పాత్రుడిని సత్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు

గాజువాక: దేవరాపల్లి మండలం గజపతినగరంలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో జీవీఎంసీ 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహ పాత్రుడిని గ్రామస్తులు ఆత్మీయంగా సత్కరించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు చేతులమీదుగా సత్కారమందుకున్నారు. గజపతినగరంలో పుట్టి, పెరిగి గాజువాకలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న నర్సింహ పాత్రుడు కార్పొరేటర్ స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయడం హర్షణీయమని ఈ సందర్భంగా ముత్యాలనాయుడు కొనియాడారు. పుట్టి, పెరిగిన గ్రామానికి కూడా ఇతోధికంగా సాయపడుతూ అందరి మన్ననలను పొందుతున్నారని పేర్కొన్నారు. గ్రామస్తులు పూలమాలలు వేసి కార్పొరేటర్‌కు అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అ'పూర్వ' విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గాజువాక: గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 32 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 1990–91వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న నాటి విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకొని తమ మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. స్నేహితుల యోగక్షేమాలను తెలుసుకున్న అనంతరం ఆట, పాటలతో సరదాగా గడిపారు. అప్పటి వ్యాయామ ఉపాధ్యాయుడు రామలింగేశ్వరరావును ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. స్నేహితుల సహాయ నిధిని సమకూర్చి తమతో చదువుకున్నవారిలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారిని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక బ్యాంకు అకౌంట్‌ను తెరిచి అందులో ప్రతినెలా కొంత చొప్పున డిపాజిట్ చేయాలని తీర్మానించుకొన్నారు. ఈ నిధికి తన తరఫున లక్షా నూట పదహారు రూపాయలను ఇస్తున్నట్టు పూర్వ విద్యార్థి కరణంరెడ్డి నర్సింగరావు ప్రకటించారు. అవకాశం ఉన్నవారు ఈ నిధికి ఎప్పుడైనా ఎంతోకొంత సాయం చేయండని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు అనిల్ జోసెఫ్, నూకరాజు, చట్టి గోపి, జయరామ్, నీలం మూర్తి, బాలాకుమార్, విజయ్‌కుమార్, జబ్బర్, మైమున్నీషా బేగం, శైలజానాయుడు, వర్మ, నర్సింగరావు, రామ్ ప్రసాద్, మోహన్ కృష్ణ, లక్ష్మి, పద్మావతి, జయలక్ష్మి, సుధీర్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాఘ పౌర్ణమి వేడుకలు



పాత గంగవరంలోసముద్రస్నానాలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: మాఘ పౌర్ణమి వేడుకలను మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని పాత గంగవరంలో వేంచేసియున్న మాధవస్వామి మహాలక్ష్మి ఆలయ తీర్థాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు మాధవస్వామి మహాలక్ష్మిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సముద్రంలో స్నానాలను ఆచరించారు. మాధవస్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. తీర్థాన్ని పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం తాగునీరు, ప్రసాదాలను పంపిణీ చేసేందుకు ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. అలాగే మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

భక్తి శ్రద్ధలతో పున్నమి నోము

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడి కోనేరును ఆనుకొని ఉన్న దుర్గాదేవి, అర్ధనారీశ్వరుడు, వెంకట అలివేలు మంగమ్మ, సాయి మందిరం వద్ద మాఘ పౌర్ణమి సందర్భంగా మహిళలు, నోములు నోచుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా విష్ణు లలిత సహస్ర పారాయణం, దేవతామూర్తులకు భక్తి భజన గీతాలు ఆలపించారు. తరువాత అన్న సమారాధన, ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ధర్మకర్త, సంతోషిమాతా భవాని భక్తురాలైన గుర్రం రత్నం సారధ్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అగనంపూడి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని నోములు నోచారు.



మాఘ పౌర్ణమి సందర్భంగా నోములు నోచుకుంటున్న భక్తులు

ఘనంగా అరబిందో పాఠశాల వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

ఉక్కునగరం: అరబిందో ఐడియల్ హై స్కూల్ వార్షికోత్సవం ఉక్కునగరంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం కె.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా, కేంద్రీయ విద్యాలయం మాజీ డిప్యూటీ కమిషనర్ జగన్నాథరావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలు చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్ టి.ఎల్లేశ్వరరావు వార్షిక నివేదికను అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ రామారావు, సినీ నటుడు గౌతంరాజు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త రామచంద్రరావు మృతి



గంటా రామచంద్ర రావు (ఫైల్)

గాజువాక: ప్రముఖ వ్యాపారవేత్త గంటా రామచంద్రరావు ఆదివారం మృతి చెందారు. అనారోగ్యంతో కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. గాజువాకలో తొలుత లక్ష్మీకాంత్ థియేటర్‌ను ప్రారంభించిన ఆయన ఆ తరువాత అదే ప్రాంగణంలో మరో రెండు థియేటర్లను నిర్మించారు. ఏలూరులో రామచంద్ర ఇంజినీరింగ్ కాలేజ్‌తో పాటు విశాఖలో రామచంద్ర గ్రూప్ హోటల్స్‌ను ఏర్పాటు చేశారు. వ్యాపారంతోపాటు గాజువాక ప్రాంతంలో ఆయన పలు సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. కాగా, కొత్త గాజువాకలోని తమ స్వగృహం నుంచి సోమవారం ఉదయం అంతిమయాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.






ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లోని వెంకటాద్రిపై కొలువై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారికి చక్రస్నానం చేయించారు. అలాగే పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీపుష్పయాగం చేశారు. ఆలయ ధర్మకర్తలు తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతుల చేతుల మీదుగా వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. గోవింద నామస్మరణతో హోరెత్తించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహానగర సాంఘిక్‌కు తరలిన బీజేపీ నాయకులు



బస్సులో బయల్దేరిన బీజేపీ, ఆరెస్సెస్ నాయకులు

గాజువాక: ఆంధ్రా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఆరెస్సెస్ మహానగర సాంఘిక్ కార్యక్రమానికి గాజువాక చెందిన బీజేపీ, ఆరెస్సెస్ నాయకులు తరలి వెళ్లారు. బస్సులో బయల్దేరిన ఈ బృందానికి బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు సారథ్యం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 97 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీనివాస్, శంకరరావు, అప్పలరాజు, తాతారావు, నాగేశ్వరరావు, అనకాపల్లి శ్రీనివాస్, రాజశేఖర్, చిరు తదితరులు పాల్గొన్నారు.